
సాక్షి
మహబూబాబాద్

ఆదివారం । 7 । జూలై । 2024



శోభాయమానం..సహస్ర కలశాభిషేకం
భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సహస్ర కలశాభిషేకం జరిగింది.
- 8లో ▸



సహకార సంఘాల ద్వారా పురోగతి
సహకార సంఘాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించవచ్చని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యాధులను అరికట్టేందుకే వ్యాక్సినేషన్



నెహ్రూసెంటర్: దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టేందుకు వ్యాక్సినేషన్ ఉపయోగపడుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని సబ్‌సెంటర్లను శనివారం సందర్శించి వ్యాక్సినేషన్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులకు పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ పంపిణీ చేయాలని, పుట్టిన నవజాత శిశువు వ్యాక్సినేషన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష, ఆరోగ్య విస్తరణ అధికారి ఒబిలిశెట్టి రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమారి, సిస్టర్లు బబిత, లలిత, అంగన్‌వాడీ టీచర్ భానుమతి, ఆశకార్యకర్తలు లక్ష్మీ, శారద, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



నెహ్రూసెంటర్: జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు తనిఖీల భయం పట్టుకుంది. అర్హత లేని సిబ్బందితో పరీక్షలు, తూతూ మంత్రంగా రిపోర్టులు ఇవ్వడం, లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు అధికంగా వస్తున్నాయి. దీనికి తోడు బాలికల నిష్పత్తి జిల్లాలో తక్కువగా ఉండడంతో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్కానింగ్ సెంటర్ల తనిఖీలను చేపడుతూ నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు వైద్యారోగ్యశాఖ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నాలుగు స్కానింగ్ సెంటర్లను పీసీపీఎన్‌డీ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సూర్యశ్రీరావు, డాక్టర్ పద్మశ్రీ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలను చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు రెగ్యూలర్‌గా జరుగుతాయని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కాగా స్కానింగ్ సెంటర్ల తనిఖీ రిపోర్టును ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు పంపిస్తామని అధికారులు వెల్లడించారు.

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

కేసముద్రం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలంటూ ఇప్పటి వరకు విజ్ఞప్తులు చేశామని, ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మండల కేంద్రంలోని హరిహరగార్డెన్స్‌లో సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు శనివారం హాజరయ్యాడు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్క రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే పెన్షన్‌లను పెంచిందని, కాని ఇక్కడ మాత్రం 7నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీ ప్రకారంగా పెన్షన్‌ను పెంచకుండా దాటవేస్తుందని విమర్శించారు. విభజన హామీల అమలు విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా సమస్యల పరిష్కారం కోసం , కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలేదన్నారు. ఇప్పటికైన బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, మార్తనేని పాపారావు, మండల పార్టీ కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, నక్క సైదులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో సమీక్ష

దోర్నకల్: గ్రామాల్లో వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ నర్మద ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈఓ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో 50 శాతం ప్రతిపాదనలు పంపారన్నారు. ప్రతీ గ్రామంలో పండ్ల తోటల పెంపకానికి సంబంధించి రెండు ఎకరాలతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్, ఈజీఎస్ టీఏ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పశువైద్యశాలలో కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది





దోర్నకల్: టీకా వేస్తున్న డాక్టర్ సురేష్



మరిపెడలో...



పశువైద్యశాలల్లో మూగజీవాల సందడి

164 కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్లు

- కుక్క కరిచిన వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవాలి
- జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి టి. సుధాకర్

జిల్లాలోని పశువైద్యశాలల్లో శనివారం పెంపుడు కుక్కల సందడి నెలకొంది. ఈ నెల 6న జూనోసిస్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 164 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.సుధాకర్ తెలిపారు. జిల్లాలో మూడు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 23 ప్రైమరీ పశు వైద్యశాలలు, 19 గ్రామీణ పశువైద్యశాలలు (సబ్ సెంటర్లు) 3 మొబైల్ పశువైద్యశాలల్లో వ్యాక్సిన్‌లు వేశారు. ప్రతీ గురువారం పశువైద్యశాలల్లో రేబీస్ వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. జిల్లాలో మూడు వేలకుపైగా కుక్కలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

- మహబూబాబాద్

రేబీస్ వ్యాధి లక్షణాలు..

- కుక్కల్లో రేబీస్ వ్యాధి లక్షణాలు కొన్నింటిలో బయటకు కన్పిస్తాయి. కొన్నింటిలో కనిపించవు.
- కుక్క నోటి నుంచి సొల్లు (లాలాజలం) ఎక్కువగా కారడం.
- లాలాజలంలో రేబీస్ వైరస్ ఉంటుంది. అవి మనుషులను కరవగానే సంక్రమిస్తుంది.
- రేబీస్ ఉన్న కుక్కలు మనుషులను కరిస్తే వారు కుక్కలా అరవడం, మనుషులను గుర్తు పట్టకపోవడం, శ్వాస కోశ సమస్యలు, లాలాజలం ఎక్కువగా రావడంతో పాటు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం.
- కుక్క కరిచిన వెంటనే 24 గంటలలోపు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- 2030 నాటికి రేబీస్ అంతం కోసం ఎస్‌హెచ్‌ఎం సంస్థ ఆధ్వర్యంలో రెస్క్యూ సెంటర్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నారు.

లక్ష్యం 46,75,000

జిల్లాలో కొనసాగుతున్న వన మహోత్సవ కార్యక్రమం

- శాఖల వారీగా మొక్కల కేటాయింపు పూర్తి
- కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణ, వృక్ష సంపదను పెంచడానికి ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టింది. దానిలో భాగంగా జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లోని మొక్కలను బట్టి శాఖల వారీగా టార్గెట్ కేటాయించారు. ఈ నెల రెండో వారం నుంచి కార్యక్రమాన్ని ముమ్మరం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వన మహోత్సవ కార్యక్రమం విజయవంతంపై సమీక్షలు నిర్వహించారు.

స్థలాల గుర్తింపు పూర్తి

శాఖల వారీగా లక్ష్యాలను పూర్తి కాగా దాని ప్రకారం స్థలాల గుర్తింపు కూడా పూర్తి చేశారు. గత సంవత్సరం లక్ష్యానికి కంటే తక్కువగా లక్ష్యాలను ఇచ్చారు. మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మున్సిపాలిటీలు, అటవీశాఖ, డీఆర్‌డీఏ శాఖల ఆధ్వర్యంలో ఉన్న నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం హరిత హారం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినా అంత హడావుడి కనిపించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో గాంధీపురం నర్సరీలో 50,000లకు పైగా మొక్కలు ఉండటంతో ఇచ్చిన టార్గెట్‌కు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సరీలో కూడా 50,000 మొక్కలు ఉన్నాయి. మరిపెడ, తొర్రూర్ మున్సిపాలిటీల పరిధిలో మాత్రమే మొక్కలు తక్కువగా ఉన్నాయి. వన మహోత్సవంలో అటవీ శాఖ కీలకం కాబట్టి ఆ శాఖ నుంచే ఎక్కువ మొక్కలను శాఖలకు కేటాయించనున్నారు.



మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు(ఫైల్)

లక్ష్యాన్ని పూర్తి చేయాలి..



వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలి. జిల్లాను హరిత వనంగా మార్చేందుకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి. నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి.

- అద్వైత్‌కుమార్ సింగ్, కలెక్టర్

శాఖల వారీగా కేటాయించిన లక్ష్యం

శాఖ	లక్ష్యం
వ్యవసాయ శాఖ	1.50 లక్షల
బీసీ వెల్ఫేర్	7,000
పంచాయతీరాజ్	70,000
డీఆర్‌డీఏ	30.50 లక్షలు
ఎక్సైజ్	50,000
అటవీ శాఖ	7,00,000
వైద్య శాఖ	7,000
హార్టీకల్చర్	1,05,000
పరిశ్రమల శాఖ	7,000
ఇంటర్మీయట్ ఎడ్యుకేషన్	7,000
ఇరిగేషన్ శాఖ	55,000
మైనార్టీ వెల్ఫేర్	7,000
మున్సిపాలిటీలు	2,50,000
పోలీస్ శాఖ	70,000
ఆర్‌అండ్‌బీ	40,000
విద్యాశాఖ	70,000
ట్రైబల్ వెల్ఫేర్	30,000

నేడు సదరం స్లాట్ బుకింగ్

మహబూబాబాద్: సదరం క్యాంపుల స్లాట్ బుకింగ్‌కు నేడు ఉదయం 12 గంటల వరకు అన్ని మీసేవ కేంద్రాల్లో ప్రారంభమవుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకుని వారికి కేటాయించిన తేదీలో సందరం క్యాంపు జరిగే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లాలన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- సైబర్ హైజీన్ పోస్టర్ విడుదల

మహబూబాబాద్ రూరల్: ప్రజలు సైబర్ నేరాల బారిన పడొద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ 'సైబర్ హైజీన్' (సైబర్ పరిశుభ్రత) అనే పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, బ్యాంకు వివరాలు ఓటీపీ, పాస్ వర్డ్‌లను ఎవరికీ తెలపవద్దన్నారు. సైబర్ క్రైంకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సీఐ సర్వయ్య, కురవి రూరల్ ఎస్సైలు గోపి, దీపిక పాల్గొన్నారు.

వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మొక్కలునాటే ప్రదేశాలు గుర్తించి మొక్కలు నాటాలన్నారు. అలాగే ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ అధికారులు సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. వర్షాకాలం మురికి నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వ్యాధులు ప్రబలకుండా పక్కా ప్రణాళికతో ముందుకు పోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- కురవిలో సుడిగాలి పర్యటన

మహబూబాబాద్: గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి కలెక్టర్ సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో సానిటేషన్ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, డీపీఓ హరిప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

గార్ల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో సూచించారు. శనివారం మండలంలోని రాంపురం, మర్రిగూడెం పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు సైడ్ డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టి కాల్వల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ రజిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మహబూబాబాద్: మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కురవిలో సుడిగాలి పర్యటన

కురవి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య కేంద్రంలో ఓపీ పెంచాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం కురవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. మండల ప్రజాపరిషత్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆయుర్వేద వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందించాలని, డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్ నిర్వహించాలన్నారు. ఆయా పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ విరాజిత, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సత్యవతి, ప్రధానోపాధ్యాయులు వహీద్, ఉప్పలయ్య, డీసీఎస్ శర్మ, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, మేట్రిన్ పద్మ పాల్గొన్నారు.



కురవి: పీహెచ్‌సీలోని వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించాలి

- డీఈఓ రామారావు

కేసముద్రం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించాలని డీఈఓ రామారావు అన్నారు. శనివారం మండలంలోని పెనుగొండ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, పీఎస్‌లను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పలు రికార్డులను పరిశీలించి తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. మెనూ ప్రకారంగా పౌష్టికాహారాన్ని అందించాలని మధ్యాహ్నభోజన కార్మికులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కే.యాదగిరి, పీఎస్ హెచ్‌ఎం వెంకట్రామనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

దోర్నకల్: విద్యాభ్యాసం నుంచి ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వహిస్తున్నంత వరకు ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులేనని డీఈఓ రామారావు తెలిపారు. మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను డీఈఓ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్, నోడల్ హెచ్‌ఎం ఆంగోత్ లక్ష్మా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మంగధరరావు, జవాది రాంప్రసాద్ పాల్గొన్నారు.



కేసముద్రం: పెనుగొండ పాఠశాలను సందర్శించిన డీఈఓ రామారావు

ఆటోను ఢీకొట్టిన వ్యక్తిపై కేసు

దంతాలపల్లి: మండలంలో ఆటోను ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి మండల కేంద్రం శివారులో చారితండా క్రాస్ రోడ్డు సమీపంలో తొర్రూరు నుంచి మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి వెళ్తున్న ఆటోను మరిపెడ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కావడంతో పాటు ఆటో ప్రయాణిస్తున్న కొమురయ్య, నరేష్, మల్లేష్‌లు మృతి చెందగా మంజుల, అంజలి, అక్షయలకు తీవ్ర గాయాలైన విషయం విధితమే. ఈ ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ బొడ్డు సురేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై కరుణాకర్ తెలిపారు.

మంగళితండాలో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్

గార్ల: 'గార్లలో విషజ్వరాలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్పందించారు. మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగళితండాలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రి ల్యాబ్‌కు పంపారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాలు, గాబులు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, అదేవిధంగా దోమల నివారణకు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ నవీన్, సీహెచ్‌ఓ సక్కుబాయి, హెచ్‌ఈఓ శ్రీహరి, హెచ్‌ఎస్‌లు రాధాకృష్ణ, ఇస్మాయిల్, వైద్యసిబ్బంది నవ్య, కామేశ్వరి, లక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు భద్రకాళి శేషు.. వరుసగా పాలాభిషేకం,చందనాభిషేకం, నేయాభిషేకం, పన్నీరు గులాబీ అభిషేకం, విబూదాభిషేకం, గంధాభిషేకం,చక్కరాభిషేకం,పెరుగాభిషేకం, గులాల్‌తో అభిషేకం, కుంకుమాభిషేకం - సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్ : వరంగల్ గవిచర్ల క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మధ్య కోటకు చెందిన మహ్మద్ ఇబ్రహీం అలియాస్ నన్న (45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గవిచర్ల క్రాస్‌కు బయలుదేరాడు. గవిచర్ల క్రాస్‌కు చేరుకోగానే బైక్‌ను కుక్క ఢీకొంది. దీంతో ఇబ్రహీం రోడ్డుపై పడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జక్య, తల్లిదండ్రులు ఉన్నారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య జక్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తత అవసరం..

సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

- రికార్డుల్లో పేర్లు చూడకపోతే అంతే..
- రవాణాశాఖ ఎంక్వైరీలో అనుమానాలు నివృత్తి చేసుకోవాలి

ఖిలా వరంగల్ : ప్రస్తుత రోజుల్లో అతి ముఖ్యమైన వాహనాలు బైక్, కారు. కిరాణం నుంచి.. ప్రయాణం వరకు ప్రతీ అవసరానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాంటే ఈ ప్రయాణ సాధనాలు లేకుండా అడుగు బయట పెట్టడం సాధ్య కాదని చెప్పడంలో అతియోశక్తి కాదేమో. ఈ క్రమంలో ఇంత ముఖ్యమైన వాహనాల కొనుగోళ్లలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేని పక్షంలో ఇబ్బందులు కొని తెచ్చుకోవాల్సిందే.

పుట్టగొడుగుల్లా పాతవాహన కన్సల్టెంట్లు..

వరంగల్ మహానగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాత వాహన కన్సల్టెంట్, షోరూంల్లో వాహనాలు కొనుగోలు చేసే సమయాల్లో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సాధారణంగా కొత్త బైక్ కొంటే వాహనదారుడు పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. దీనిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. అయితే సెకండ్ హ్యాండ్ బైక్‌లు, కారులు కొనుగోలు చేసుకున్నప్పుడు వాటి రికార్డులు, ఆర్‌సీబుక్, ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్ వంటి వాటిని చూడడం సర్వసాధారణం. ఈ క్రమంలో ఆయా జిల్లాల రవాణాశాఖ కార్యాలయంలో ఆ వాహనం ఎవరి పేరున ఉంది? దాని పరిస్థితి ఏమిటి? అనే విషయం తెలుసుకోలేకపోతే ఇబ్బందులు తప్పవు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బైక్‌లు

దోపిడీలకు వినియోగించిన వాహనాల విక్రయం..

హత్యలు, దోపిడీలకు వినియోగించిన వాహనాలను కొంత మంది నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాలో విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసిన అమాయకులు చిక్కుల్లో పడే పరిస్థితులు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రవాణాశాఖ.. వాహనాలకు సంబంధించిన డేటా మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. దీంతో వాహనం కొనుగోలు చేసే ముందు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించి కేసుల వివరాలు సేకరించి సెకండ్ వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు తెలుపుతున్నారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వెబ్ సైట్‌ను ఓపెన్ చేసి వాహనం నంబర్ ఎంటర్ చేయగానే పేరు, అడ్రస్ ఇతర వివరాలు కనిపిస్తాయి. వాటి ఆధారంగా బైక్ లేదా కారు ఎక్కడైనా చోరీకి గురికాగానే వాహనదారుడి పేరు, ధ్రువీకరణ పత్రం, ఇన్సూరెన్స్ పత్రాల పరిశీలనతోనే తెలిసిపోతుంది. ధ్రువీకరణ పత్రాలు ఎక్కడైనా మార్ఫింగ్ జరిగినట్లు అనిపిస్తే వెంటనే ఆర్టీఏను సంప్రదిస్తే వాహన వివరాలు పొందొచ్చు. అతివేగంగా వాహనాలు నడిపిన వారికి, ప్రమాదం చేసి తప్పించుకుని తిరుగుతున్న వాహనాల వివరాలు కేసు నమోదును బట్టి తెలిసిపోతుంది. ఏదీ ఏమైనా సెకండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించకుంటే కష్టాలు తప్పవని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసే ముందుకు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించాలని వారు సూచిస్తున్నారు.

పత్రాలు సరిచూసి కొనుగోలు చేయాలి



సెకండ్ హ్యాండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ధ్రువీకరణ పత్రాలు సరిచూసిన వెంటనే ఆర్టీఏ కార్యాలయాన్ని సంప్రదించి వాహన వివరాలు తెలుసుకోవాలి. వాహన రిజిస్ట్రేషన్‌తో పేరు మార్పిడి జరుగుతుంది. వాహనం విక్రయించే వారు వెంటనే కొనుగోలుదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. వాహనం కొనాలన్నా, విక్రయించాలన్నా ఆర్టీఏ నిబంధనలు పాటించాలి.

-జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారికి సహస్ర కలశాభిషేకోత్సవం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, నాందీ, ఆయుష్యమన్త్రజపం, బ్రహ్మకూర్చహవనం, పంచగవ్యప్రాశనం, ఋత్విక్‌గ్వరణము, మధుపర్కవిధి, ప్రతిసరబంధము, వాస్తుయాగం, పర్యగ్నీకరణం, మత్సంగ్రహణం, వర్ధనీపూజ, యాగశాల ప్రవేశము, భూతోత్సాదనం, మండపస్థాణపూజ, ద్వారాతోరణపూజ, ధ్వజారోహణం, కర్కరీస్థాపనం, బలిప్రధానం, కుండసంస్కారం, అగ్నిప్రతిష్ఠ, సర్వతోభద్రవాస్తు యోగినీ, గణపతి నవగ్రహ క్షేత్రపాలమండలదేవతాయజనం నిర్వహించి కలశస్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి..

హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు అమ్మవారి సన్నిధిలో జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఈఓ శేషుభారతి, భద్రకాళిశేషు, అర్చకులు.. రాజేందర్‌రెడ్డి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతించారు. ఎమ్మెల్యే ఆదిశంకరులను, వల్లభగణపతిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు శేషవస్త్రాలు మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లును ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆలయ మాడవీధుల నిర్మాణానికి గతంలో ఇచ్చిన రూ. 30కోట్లు, అదనంగా రూ. 70కోట్లతో భద్రకాళి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు ఈవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి శరణంమమ..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పబడిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణంమమ అంటూ చదువుతుండగా అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. దేవాలయ అర్చకులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. శీతలోదకం, ఉష్ణోదకం, పాలు, పెరుగు, నెయ్యి, తేనే, చక్కెర,కొబ్బరి నీళ్లతో అభిషేకం జరిపారు. ఆ తరువాత మండలంలోని తొమ్మిది కోష్టాలలో మూలమంత్రాలతో తీర్థావాహన చేసి అమర్చిన 1008 కళశాలలోని ద్రవ్యాలను వేదపండితులు అమ్మవారి శిరస్సు పైనుంచి ధారగా అభిషేకించారు. కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి దంపతులు సహస్రకలశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో ఆవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ జరిపారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

- 50.10శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది ఏప్రిల్–మేలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవోకేషన్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి.. పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారితో కలిసి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తం డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 46,130మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరుకాగా అందులో 23,114మంది విద్యార్థులు ఉత్తీర్ణత(50.10శాతం) సాధించారని పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి తెలిపారు. బాలురు 22,355మంది పరీక్షలకు హాజరుకాగా 8,465మంది ఉత్తీర్ణత(37.87శాతం) సాధించారు. బాలికలు 23,784 మంది పరీక్షలు రాయగా అందులో 14,649మంది ఉత్తీర్ణత (61.59శాతం) సాధించారు. ఉత్తీర్ణతలో బాలురకంటే బాలికలదే పైచేయిగా ఉంది. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, ఎ. నరేందర్, బీఎస్ఎల్ సౌజన్య, క్యాంపు ఆఫీసర్ ఆసిం ఇక్బాల్, క్యాంపు బాధ్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల విభాగం అధికారులు

ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు..

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881 మంది విద్యార్థులకుగాను 9,657 మంది ఉత్తీర్ణత(51.15) సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగాను 6,352మంది ఉత్తీర్ణత (53.79శాతం) సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449మంది విద్యార్థులకుగాను 7,105మంది ఉత్తీర్ణత (45.99శాతం) సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. ఈనెల 7వ నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

రిపోర్టర్ల పేరుతో బెదిరింపులు..

- దారి దోపిడీ ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(కె): రిపోర్టర్ల పేరుతో మండలంలో కాంట్రాక్టర్లు, లారీ డ్రైవర్లు, వాహనదారులను బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం వెంకటాపురం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బండారి కుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంగళరావుపేటకు చెందిన వేల్పుల రామ్‌కుమార్, వేల్పుల నవీన్, ఎస్సీ మర్రిగూడేనికి చెందిన వేల్పుల మనోజ్ స్నేహితులు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన ఓ లారీ.. ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు నుంచి జగదల్ పూర్ మార్కెట్‌కు వెంకటాపురం మండలం మీదుగా వెళ్తోంది. మండలంలోని రామచంద్రాపురం సమీపంలో రాత్రి 11.30 గంటలకు రామ్‌కుమార్, నవీన్, మనోజ్ ప్రెస్ లోగో పట్టుకుని లారీని ఆపి డ్రైవర్ అనుముల్ కృష్ణను బెదిరించారు. అనంతరం డ్రైవర్ వద్ద ఉన్న రూ. 40 వేలు లాక్కున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబుతే చంపుతామని బెదిరించారు. అనంతరం శనివారం ఉదయం ముగ్గురూ.. వేల్పుల రామ్ కుమార్ ఇంటి వద్ద కలుసుకుని ఇసుక లారీ, కాంట్రాక్టర్లను రిపోర్టర్ల పేరుతో బెదింపులకు పాల్పడి వసూలు చేద్దామని ప్లాన్ చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు తమ నేరం అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి రూ. 32 వేల నగదు, ప్రెస్ లోగోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రిపోర్టర్ల పేరు చెప్పి ప్రజలపై అజమాయిషీ చేస్తూ బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



గుంషావళి (ఫైల్)

గూడూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మర్రిమిట్టలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్కే. గుంషావళి (52) భార్య ఖైరుతో కలిసి కూలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉండగా వారికి పెళ్లిలు అయ్యాయి. కాగా, ఇటీవల గుంషావళి.. భార్యతో నిత్యం గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భార్య ఇంటి ముందు ఉండగా గుంషావళి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సమయం తరువాత ఇంట్లోకి వెళ్లిన భార్యకు భర్త వేలాడడం చూసి కేకలు వేసింది. ఆమె కేకలు విన్న పక్కింటి వారు వెళ్లి చూడగా అప్పటికే గుంషావళి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : వరంగల్ బట్టలబజార్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పక్క గల్లీలో ఈ నెల 1వ తేదీన జరిగిన కూలీ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. శనివారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గోపితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ వందన హైస్కూల్ వద్ద నివాసముండే ఇంగిల్కర్ రవీందర్.. వరంగల్ బస్టాండ్ వద్ద ఆంధ్రాహోటల్‌లో పనిచేసే వాడు. హోటల్‌లో పని మానేసిన అనంతరం యాచిస్తూ వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర నిద్రించేవాడు. అక్కడ అతడితో పాటు ఓ మానసిక దివ్యాంగురాలు నిద్రించేది. ఈ క్రమంలో 30వ తేదీ రాత్రి వీరభద్రచారి మద్యం సేవించి రాత్రి 12.30 గంటల సమయంలో మానసిక దివ్యాంగురాలు ఉన్న ప్రాంతం వద్ద నిద్రించాడు. ఆ సమయంలో రవీందర్ అక్కడికి చేరుకుని 'నువ్వు ఇక్కడ మహిళ పక్కన ఎందుకు పడుకున్నావు' అని వీరభద్రచారితో గొడవపడ్డాడు. ఈ గొడవలో వీరభద్రచారిని సీసీ రోడ్డుపై పడేశాడు. వెంటనే అక్కడ ఉన్న రాయితో తలపై మోదీ చంపేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితుడు రవీందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎస్సై నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే పురోగతి

- టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: సహకార సంఘాల ద్వారా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పురోగతి సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడారు. సహకార సంస్థల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 280 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రమేశ్, మురళీధర్, రవి రాజా, పులిపాక శ్రీనివాస్, సాంపల్లి నర్సింహారావు, కాకతీయ సహకార ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ యాకుబ్, అధ్యాపకుడు రాజయ్య, డీసీసీబీ జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధుసూదన్, గంప స్రవంతి, గొట్టం స్రవంతి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రుణాలు వసూలు చేయాలి

ప్రాథమిక సహకార సంఘాలు, డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా ఇచ్చిన అన్ని రకాల రుణాలను వసూలు చేయాలని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదేశించారు. శనివారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లు, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కర్షకమిత్ర, ఎల్‌టీ, పీటీఎల్, డెయిరీ, షీప్, ట్రాక్టర్, హార్వెస్టర్, జేఎల్‌జీ, మార్టిగేజ్ రుణాలు రికవరీ చేయాలన్నారు. రికవరీ కానీ రుణాలను లీగల్ యాక్షన్ ద్వారా వసూలు చేయాలన్నారు. డిపాజిట్ల టార్గెట్ సాధించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ఏర్పాటు

హన్మకొండ: వినియోగదారుల సమస్యల పరిష్కరించేందుకు, ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిల్‌లు, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు, ఎస్ఏఓ, ఏఏఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదులు విశ్లేషించుకోవచ్చన్నారు. ఒకవేళ వినియోగదారుడు ఫిర్యాదుపై సంతృప్తి చెందకపోతే ఆ ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఈ ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, కార్పొరేట్ కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అన్ని సర్కిళ్లలో విద్యుత్ బిల్లులపై క్యూ ఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.తిరుమల్ రావు, కె.ఎస్.గుట్ట, కిషన్, జీఎంలు గౌతమ్ రెడ్డి, దేవేందర్, కృష్ణ మోహన్, మల్లికార్జున్, నాగ ప్రసాద్, శ్రీనివాస్, శేషారావు, డీఈ ఐటీ కె.అనిల్ కుమార్, డీఈ టీ.శ్రీధరాచారి పాల్గొన్నారు.